# మాఘమాస ప్రబోధము

# MAAGHA MAASA PRABODHAMU




పూజ్యపాద శ్రీ స్వామి కృష్ణానంద సరస్వతి

శివానందాశ్రమము (ఋషీకేశ్)


ఆవిర్భావము : 25.4.1922

తిరోభావము : 23.11.2001

# విశ్వప్రార్థన

ఓ పూజ్య ప్రభూ! క్షమా పరిపూర్ణా! ప్రేమమయా!
నీకు నమస్కృతులు, సాష్టాంగ ప్రణామములు.
నీవు సచ్చిదానందుడవు, సర్వాంతర్యామివి,
సర్వ శక్తిమయుడవు, సర్వజ్ఞుడవు,
సర్వజీవ హృదయాంతర వాసివి.
కరుణార్ద్ర హృదయము, సమదృష్టి, స్థిరమనస్సు,
భక్తి విశ్వాస జ్ఞానములను మాకు ప్రసాదించుము.
ఆకర్షణల నణగద్రొక్కి చిత్తవృత్తుల నరికట్టుటకు
మాకు వలయు అంతరాధ్యాత్మిక శక్తి నొసంగుము;
కామ, క్రోధ, లోభ, ద్వేషముల బారినుండి మమ్ము తప్పింపుము;
మా హృదయ ఫలకములను సద్గుణములతో నింపివేయుము.
ఈ సర్వనామరూపములలో నిన్ను తిలకింపనిమ్ము;
ఈ సర్వనామరూపములలో నిన్ను సేవింపనిమ్ము;
నిన్ను సదా స్మరించుకొననిమ్ము;
నీ లీలలను సదా గానము చేయనిమ్ము;
నీ నామము సదా మా పెదవులపై ఉండనిమ్ము;
నీలో సదా మమ్ము వసింపనిమ్ము.

*–సద్గురు స్వామి శివానంద, ఋషీకేశ్.*

---

సూచన : సర్వమతావలంబికులు సర్వ సందర్భాలలో ఈ ప్రార్థన చేసికొనవచ్చును.

ॐ

# మాఘ మాస ప్రబోధము

# MAAGHA MAASA PRABODHAMU

# విశ్వప్రార్థన

## (హిందీ భాష యందు)

హే స్నేహ్ ఔర్ కరుణా కే ఆరాధ్య దేవ్!
తుమ్హే నమస్కార్ హై, నమస్కార్ హై ।
తుమ్ సర్వవ్యాపక్, సర్వశక్తిమాన్ ఔర్ సర్వజ్ఞ హో।
తుమ్ సచ్చిదానంద హో।
తుమ్ సబ్ కే అంతర్యామీ హో।

హమేం ఉదారతా, సమదర్శితా ఔర్ మన్ కా సమత్వ ప్రదాన్ కరో ।
శ్రద్ధ, భక్తి ఔర్ ప్రజ్ఞ సే కృతార్థ్ కరో ।
హమేం ఆధ్యాత్మిక్ అంతఃశక్తి కా వర్ దో,
జిస్‌సే హమ్ వాసనావోం కా దమన్ కర్ మనోజయ్ కో ప్రాప్త్ హోం ।
హమ్ అహంకార్, కామ్, లోభ్, ఘృణా, క్రోధ్ ఔర్ ద్వేష్ సే రహిత్ హోం ।
హమారా హృదయ్ దివ్య గుణోం సే పరిపూరిత్ కరో ।


హమ్ సబ్ నామ్-రూప్ మే తుమ్హారా దర్శన్ కరేం ।
తుమ్హారీ అర్చనా కే హీ రూప్ మే ఇన్ నామ-రూపోం కీ సేవా కరేం ।
సదా తుమ్హారా హీ స్మరణ్ కరేం ।
సదా తుమ్హారా హీ మహిమా కా గాన్ కరేం ।
తుమ్హారా హీ కలికల్మషహారీ నామ్ హమారే అధర్-పుట్ పర్ హో।
సదా హమ్ తుమ్‌మే హీ నివాస్ కరేం ।

--స్వామి శివానంద

# మాఘ మాస ప్రబోధము

## MAAGHA MAASA PRABODHAMU

(" Yoga as a Universal Science" అను పూజ్యపాద
శ్రీ కృష్ణానందస్వాములవారి ఆంగ్ల గ్రంథములోని 30 అంశములకు
శ్రీ హంసానందస్వాములవారి ఆంధ్రానువాదము)



**" నారాయణ సమారంభాం ఆచార్యత్రయ మధ్యమామ్ ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే శ్రీ కృష్ణానంద సద్గురుమ్"**

(పూజ్యపాద శ్రీ కృష్ణానందస్వాములవారి జన్మశతాబ్ది (25. 4. 2022)
శుభసందర్భమునందు శ్రీవారి చరణకమలములయందొక
పూజాపుష్పముగా సమర్పింపబడినది. )

ఓం

# మాఘ మాస ప్రబోధము

# MAAGHA MAASA PRABODHAMU


ప్రచురణ : మాధవ దివ్యధామ్,
బెంగుళూరు.
మొబైల్: 919833942499

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2022

ప్రతులు : 500

ఆర్థిక సహాయము: శ్రీ నిట్టా రామ్‌ప్రసాద్ & శ్రీమతి సుశీల
612, స్కార్‌బరో పాస్‌రోడ్,
ఓర్లాండో, FL 32835 (U.S.A)

ముద్రణ : శ్రీ చక్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
తాటిపాక – 533 249
సెల్ : 98669 52350

మూల్యము : మోక్షాపేక్ష.

**(ఈ గ్రంథము శ్రీ నిట్టా రామ్‌ప్రసాద్ & శ్రీమతి సుశీల, 612, స్కార్‌బరో పాస్‌రోడ్, ఓర్లాండో, FL 32835 (U.S.A) వారి సహృదయతతోను, శ్రీమతి రమణీజయరామ్, మాధవదివ్యధామ్, బెంగుళూరువారి ఆకాంక్షతోను, శ్రీ యు. నారాయణరావు – శ్రీమతి సరస్వతి – రాజోలువారి నిర్విరామ కృషిచేతను, పూజ్యశ్రీ స్వామి హంసానంద, శ్రీ శివానంద ఆశ్రమము H.Q. వారి దివ్యాశీస్సులతోను ప్రచురింపబడినది.)**

ॐ

# విషయసూచిక

**ఆముఖము**

1. యోగమనునది ఒక పవిత్రమైన శబ్దముగా అర్థమొనర్చుకొనబడును గాక!
2. యోగమనగా:- కర్మయందు కౌశలత్వము.
3. యోగమనగానేమి?
4. యోగము అందరికిన్నీ ప్రియమైన పదార్థము.
5. క్రియ-ప్రతిక్రియలు సమానమైనవి, వ్యతిరిక్తమైనవి కూడా.
6. జ్ఞానము లేకున్నచో, అభ్యాసము తప్పుదారి పట్టును.
7. ఈ ప్రపంచము దేనితో చేయబడినది?
8. విద్య మనుజులకు ప్ర ప్రథమ ఆవశ్యకతయై యున్నది.
9. విశ్వము కేవలము మనకు కానబడునటు వంటిది కాదు.
10. మనము నిమ్నభూమికలను దాటియున్నా మనుట సాధ్యమే!
11. మన మిప్పుడు మానవభూమిక యందున్నాము.
12. మన మీప్రపంచమునందు సంతుష్టులమై యుండజాలము.
13. యోగాభ్యాసమును మనమేల ప్రారంభింపరాదు?
14. మనము ఊరికే ఉండజాలము.
15. మనము బంధమును ఇష్టపడము.
16. నిజమైన స్వాతంత్ర్యము.
17. పర్యావరణను సూచించుటకై "విశ్వము" సరియైన శబ్దము.
18. మనము శాశ్వతముగా విశ్వమునకు సంబంధించి యున్నాము.

19. మనమీ ప్రపంచము యొక్క పౌరులము ఎంతమాత్రమున్నూకాము.

20. ఆధునిక భౌతిక శాస్త్రము చెప్పునదిదియే?

21. ఆరంభము నందొక కణముండెనని జీవశాస్త్రము పలుకును.

22. నిజముగా అంతవంతమైన వస్తువు అనంతమైన దానిని చింతింపజాలదు.

23. ద్రష్ట మఱియు దృశ్యములే! పురుషుడు మఱియు ప్రకృతి.

24. వ్యక్తియందున్న ద్రష్టను గుర్తించుటయే! అధ్యాత్మ మనబడును.

25. ద్రష్ట–దృశ్యములకు మధ్య సంబంధము అనివార్యము.

26. మూడవ పదార్థములేనిదే రెండు పదార్థములకు సంబంధముండదు.

27. శ్రవణమునకు శబ్దము విషయమై యున్నది.

28. మనము సామాన్యముగా తలంచునదిదియే!

29. మనమిప్పుడు మన గృహమునకు దూరముగా నున్నాము.

30. ద్రష్ట చూడబడదు.



ఓం

# ఆముఖము

నేను 1965 నుండి 2001 వరకు పూజ్యపాద శ్రీ కృష్ణానందస్వాముల వారి ఉపన్యాసములను, సత్సంగ సంభాషణలను శ్రవణము చేసితిని. శ్రీవారి ఉపన్యాసములుగాని, వారు రచించిన గ్రంథములుగాని భాషాశైలిని బట్టియు, భావగాంభీర్యమును బట్టియు కొఱుకురాని కొయ్యలవంటివని చెప్పవలసి యున్నది. నేను ప్రప్రథమముగా శ్రీవారి భగవద్గీతోప న్యాసములను శ్రీశివానందా శ్రమములోని భజనహాలులో శ్రవణము చేసితిని. "అనగననగరాగ మతిశయిల్లుచునుండు– తినగతినగ వేముతియ్య నగును" అన్నట్లు శ్రీవారి ఉపన్యాసములను శ్రవణము చేయగా చేయగా, వారి గ్రంథములను పలుమార్లు పఠింపగా పఠింపగా– చెఱకు రసము వంటి మాధుర్యము మనకు అనుభవ గోచరమగును. అట్లుకాదేని "చేతికందని ద్రాక్షపండ్లుచేదు" అన్నట్లుండును. ఆధ్యాత్మిక విషయముల యందాసక్తి కలవారు మఱియు ప్రాపంచిక విషయముల యందనాసక్తి కలవారు మాత్రమే! శ్రీవారి హృదయ కలశములోని జ్ఞానామృతమును పానముచేయుట కువ్విళ్ళూరు చుందురు. అట్టివారికి భవబంధవిమోచన కవాటము అవశ్యముగా తెఱచుకొనును. మఱియు సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మ భవనమునందు ప్రవేశించుటకు అర్హతలభించును.

పూజ్యపాద శ్రీకృష్ణానంద స్వాములవారి **Yoga as a Universal Science** అనుగ్రంథము 12వ నవంబరు 2021వ తేదిన దివ్యజీవన సంఘ ప్రముఖాలయమునందు విడుదలగావింప బడెను. దానిని పూర్తిగా పఠించిన తర్వాత ఆ గ్రంథములోని 30 ముఖ్యాంశములను ఆంధ్రీకరించి, పాఠకుల కందింపవలయునను కోరిక నాకు కలిగెను; అట్లొనర్చుటయు జరిగెను.

ఆధునిక కాలములోని ప్రజలకు ఆధ్యాత్మిక గ్రంథములను జీవితమునందొకసారైనను పఠించుటకు తీరిక లేకున్నది. ఈ కారణముచే పై గ్రంథములోని కొన్నిముఖ్యమైన అంశములను క్రోడీకరించి "**మాఘమాసప్రబోధము**" అనుపేరుతో శ్రీవారి జన్మశతాబ్ది (25-4-2022) శుభసందర్భమునందు శ్రీవారి చరణకమలముల యందొక పూజాపుష్పముగా సమర్పించుకొను చున్నాను. ఇది అవశ్యముగా తమ జీవితగమ్యము నొందగోరు సాధకులకు ఉపకరించునని నేను విశ్వసించుచున్నాను. (ఈ పుస్తకమును కేవలము మాఘమాసములోనే చదువవలయునను నియములేదు.) ప్రస్తుతము మీ హస్తములయందున్న ఈ పుస్తకము ప్రచురింపబడుటకు కారణము శ్రీ యు.నారాయణరావు (రాజోలు దివ్యజీవన సంఘశాఖ కార్యదర్శి) గారు సంకలనము గావించిన "**Spiritual Journey in November**" అను పుస్తకమని చెప్పకతప్పదు.

ఈ గ్రంథమునకు భక్తిప్రపత్తులతో ఆర్థికసహాయ మొనర్చినట్టి శ్రీ నిట్టా రాంప్రసాద్ & శ్రీమతి సుశీల, 612, స్కార్‌బరోపాస్‌రోడ్, ఓర్లాండ్, ఎఫ్.ఎల్ 32835 (యు.యస్.ఎ) గారలకు, ప్రచురించినట్టి "మాధవ దివ్యధామ్" సంస్థాపకులకు, ప్రూఫ్‌లను సరిదిద్దిఇచ్చి సహకరించిన రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్‌గారైన యు.నారాయణరావు గారికి, అనేక విషయములలో చేదోడువాదోడుగా యుండి సహకరించిన వారి ధర్మపత్ని శ్రీమతి సరస్వతిగారికి, ఆకర్షణీయముగా ముద్రణ గావించి, సకాలములో అందించిన శ్రీచక్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తాటిపాక వారికి నాహృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములను తెలుపుకొనుచున్నాను.

ఇట్లు :-

మీ ఆత్మ

(స్వామి హంసానంద)
శ్రీ శివానందాశ్రమము,
ఋషీకేశ్-249 192

తేది : 3-12-2021
78వ అఖండమహామంత్ర
సంకీర్తనయజ్ఞ వార్షికోత్సవము

ॐ

# 1. యోగమనునది ఒక పవిత్రమైన శబ్దముగా అర్థమొనర్చుకొనబడును గాక!

భారతీయ శాస్త్రజ్ఞానమునందు పతంజలి మహర్షికి గొప్పపేరు కలదు. ఆతడొక గొప్పమహానుభావుడై యుండెను. నేటి కాలములో "యోగమ"ను నది మిక్కిలి అపార్థమొనర్చు కొనబడుటయేగాక, దుర్వినియోగ మొనర్పబడుచున్నది కూడా. యోగమనునది ఒక పవిత్రమైన శబ్దముగా అర్థమొనర్చుకొనబడునుగాక! అది ఆరంభమును మఱియు అంతమును కూడా సూచించును. అది మానవజీవిత అస్తిత్వమునకు ఆదర్శము వంటిది. యౌగిక జీవనమును గడుపుటకే మనుజుడు జన్మించి యున్నాడు. ఆశ్చర్యకరమైన దురదృష్టవశాత్తు మానవుడు స్వర్గలోకమునుండి క్రిందపడి, దేవునికి దూరమయ్యెను. "ఏల" అనునది దివ్యమైన రహస్యము. యోగమును సక్రమమైనరీతిలో అభ్యసించినచో, మనుజుడు తాను పోగొట్టుకొన్న సామ్రాజ్యమును ప్రాప్తింపజేయు ననుమాట నిశ్చయము. అది తిరిగి అంతిమసత్యముతో తాదాత్మ్యము నొందింపజేయును. వివిధములగు హంగులతో అవయవములను త్రిప్పుట మఱియు వంచుట యోగముకాదను విషయమిప్పుడు మీకు స్పష్టమైయుండును. మందిరములలో గంటలు మ్రోగించుట, లేక తాళములను వాయించుట యోగము కాదు. ఒక క్రొవ్వొత్తిని, లేక గోడపైనున్న చిహ్నమును ఏకాగ్రతతో చూచుటయున్నూ యోగముకాదు. ఐతే ఈ విధానములు అర్థరహితమైన వని నేను చెప్పుట లేదు. కాని అవి ప్రారంభదశలోని అంశములు. సత్యాన్వేషణయందు యోగమునభ్యసించు విద్యార్థికివి అ–ఆ–ఇ–ఈ ల వంటివి.

# (౨) యోగమనగా :- కర్మయందు కౌశలత్వము.

యోగమనెడి శబ్దమునర్థమొనర్చు కొనులకై మనము గురువులు మఱియు దైవాంశసంభూతుల యొక్క మార్గదర్శిత్వము కొరకై ఇటునటు వెదకనవసరము లేదు. సర్వాధిక్యుడైన శ్రీకృష్ణపరమాత్మ తన ఆధ్యాత్మిక గ్రంథరాజమైన "శ్రీమద్భగవద్గీత" యందు యోగముగూర్చి అసంఖ్యాకములైన నిర్వచనముల నొసంగియున్నాడు. దేవుడు మనుజునికి నేర్పిన శాస్త్రమే! భగవద్గీత. అది మనము పోగొట్టుకొన్న సామ్రాజ్యమును మరలఎట్లు పొందగలమో, మనకు తెలుపును. ఆధ్యాత్మికమార్గములోని చిక్కుసమస్యల నన్నింటిని అదిపోగొట్టును. అది విశ్వేశ్వరుని తిరిగిదరిజేరుటెట్లో మనకు తెలియజేయును. ఈ పవిత్రగ్రంథమునందు యోగమనెడిశబ్దము వివిధములగు దృష్టికోణములననుసరించి నిర్వచింపబడినది. "యోగః కర్మసు కౌశలమ్"(2-50) వంటి స్పష్టములైన మఱియు సూటియైన నిర్వచనములా గ్రంథమునందున్నవి. కర్మయందు కౌశలత్వమే! యోగమని పైవాక్యమున కర్థము. "సమత్వం యోగ ఉచ్యతే" (2-48) మానసిక సంతులనమే! యోగమని దీని భావము. పతంజలి స్వయముగా "చిత్తవృత్తి నిరోధమే!" యోగమని నిర్వచించెను. శ్రీ కృష్ణుడు మఱియు పతంజలియొక్క ఈ నిర్వచనములు యోగముయొక్క అంత్యభాగమైన శాశ్వతమైన పూర్ణత్వము నొందింప జేయును. దీనినభ్యసించుటచే సర్వదుఃఖ నివృత్తి మఱియు పరమానందప్రాప్తి చేకూరును.

# 3. యోగ మనగా నేమి?

శ్రీకృష్ణుడు శ్రీమద్భగవద్గీత 6వ అధ్యాయములోని 23వ శ్లోకమునందు "దుఃఖ సంయోగ వియోగమే! యోగమ"ని పలికెను. ఈ విషయమై ఇది శ్రీకృష్ణుని చివరివాక్యము. యోగమనగా నేమి? అన్ని సమయములలోను సమస్త దుఃఖములనుండి విడవడజేయునదే! యోగము. మనుజునికి దుఃఖనివృత్తిని కలిగించి, అతనిని అనంతత్వమునందు యోగము ప్రతిష్ఠింప జేయును. జీవితములోని సమస్యలను నివారించుటకై కొన్ని యోగపద్ధతు లిచ్చుట చెప్పబడుచున్నవి. వీటిలో కర్మయోగము, భక్తియోగము, రాజయోగము మఱియు జ్ఞానయోగములు ముఖ్యమైనవి. యోగములోని ఈ పద్ధతులలో నానారకములగు అంశములున్నను, యోగమనునది ముఖ్యాంశమై యున్నది. ఇది అంతఃకరణమును పరిశుద్ధమొనర్చును. అంతఃకరణమునందు సత్పపదార్థము దేదీప్యమానముగా ప్రకాశించుచుండగా, దానిని కప్పివేయుచున్న అహంకారమనెడి మేఘమునిది తొలగించును. యోగముగూర్చిన వివిధములగు బోధనలలో సర్వసామాన్యములగు అంశములు అన్ని యోగములందున్నవి. భౌతిక ఆరోగ్యము, నైతికశిక్షణ, ధారణ, నిస్స్వార్థత, వైశ్వానరదృష్టి కోణము అనునవి ఈ యోగము లన్నింటిలో సర్వసామాన్యములై యున్నవి. పతంజలిమహర్షి ముఖ్యముగా మనోనిగ్రహమునకు ప్రాధాన్యత నొసంగినను, ఆధ్యాత్మిక అధిరోహణమునిది చాటిచెప్పుచున్నది.

# 4. యోగము అందరికిన్నీ ప్రియమైన పదార్థము.

ప్రపంచములోని ప్రజలందఱును సామాన్యముగా "యోగమ"నెడి శబ్దముగూర్చి తెలిసినవారై యున్నను, ప్రపంచము నందెన్ని మనస్సులున్నవో, అన్నిభావములు, అన్నినిర్వచనములు దానినిగూర్చి కలవు. ప్రతి టోపీ క్రింద ఒక్కొక్క ప్రపంచమున్నదని సర్వసామాన్యముగా చెప్పబడుచున్నది. ప్రతివ్యక్తియు యోగముగూర్చి తనస్వంత అభిప్రాయమును కలిగియుండును. అది కొన్నివేళలలో ఉచ్ఛదశ యందుండును. కొన్నివేళలలో నికృష్టదశయందుండును. మరికొన్ని వేళలలో అపార్థమొనర్చు కొనబడును. సామాన్యముగా తనస్వంత అభిప్రాయము ననుసరించి ఉద్దేశ్యపూర్వకముగా అన్యథా భావింప బడుచుండును. కాని "పూర్ణత్వము"నొంద దలంచు సాధకులు జాగరూకులై యుందురు. ఆతడు దానినొక సాంఘిక సమస్యగా తలపోయడు,లేక కీర్తి–ప్రతిష్ఠలను, ధనధాన్యములను సమకూర్చునదిగా భావింపడు. యోగము అందరికిన్నీ ప్రియమైన పదార్థము. యోగముయొక్క నిజమైన అర్థమును గుర్తెఱింగినప్పుడు, యోగముకంటె మిక్కిలి ప్రియమైనది మరియొకటి లేదని మనుజుడు తెలిసికొనును. అది కేవలము కళాశాలలోని విద్యార్థి ఎన్నుకొనునట్టి విషయము కాదు. అది పరీక్షలలో విజయమునొంది, డిగ్రీని సంపాదించుటకు వినియోగపడదు. అది దైనికజీవితము నందభ్యసింప బడునట్టి కళ.

# 5. క్రియ-ప్రతిక్రియలు సమానమైనవి, వ్యతిరిక్తమైనవి కూడా.

యౌగిక క్రియ ఒక అభ్యాసము.అది మనదైనిక జీవితము నందనుష్ఠింబడు విధానము. అది వస్తు స్వరూపమును వ్యక్తమొనర్చును, లేక విశ్వనిర్మాణమును పరికింపజేయును. మనము ప్రపంచమునందునికిని కలిగియున్న కారణముచే, వస్తుస్వరూపమునకు భిన్నముగా ప్రవర్తింపజాలము. మనమీ ప్రపంచమునకు బాహ్యముగా లేము. కావున ప్రపంచము, లేక విశ్వముయొక్క సిద్ధాంతము ననుసరించి మనము ప్రవర్తించుట మనకు భావ్యమగును. మఱియు ఎవడైనను ఈ సిద్ధాంతమును తృణీకరించు ప్రయత్నము నొనర్చునేని, విశ్వాధికారము ననుసరించి ఆతడు అప్రయత్నముగా శిక్షింపబడును. దీనిని నెరవేర్చుటకు విశ్వాధికారమునకు భిన్నమైన వాడుండడు. విశ్వము ఒక విశాలమైన కంప్యూటర్‌ను పోలియుండును. అది స్వయముగా పనిచేయుచుండును. క్రియకు ప్రతిక్రియ స్వయముగా జరుగుచుండును. ఈ యంత్రమును నడుపుటకేలాటి వ్యక్తియు ఉండడు. క్రియ-ప్రతిక్రియలు సమానమైనవి, వ్యతిరిక్తమైనవి కూడా. ఈ విషయము భౌతికము మఱియు గణితశాస్త్ర భూమికలలో ప్రతియొక్కరికి తెలిసినదే! విశ్వముచే నియమింపబడిన పదార్థములచే ఇది జరుగుచుండును. మనమీ విశ్వమునకు బాహ్యముగా లేము అను విషయమును మనము మరువరాదు. మనమీ మానవ సంఘమునకు కూడా బాహ్యముగా లేము.

## 6. జ్ఞానము లేకున్నచో, అభ్యాసము తప్పుదారి పట్టును.

యౌగిక విద్యార్థులకు ప్రప్రథమముగా కావలసినదేమనగా:– అభ్యసించుటకై అకస్మాత్తుగా ప్రత్యేక సాధనలలో దుముకరాదు. ఏలననగా:– పదార్థజ్ఞాన ఫలితమే! అభ్యాసమని చెప్పబడును. జ్ఞానము లేకున్నచో, అభ్యాసము తప్పుదారి పట్టును. కావున సామాన్యముగా వేదాంతభూమికలలో నైతికత తత్త్వవిచారణపై ఆధారపడి యుండునని చెప్పబడును. ఇచ్చట నైతికత యనగా:– అభ్యాసమునకు సంబంధించిన ఏ వస్తువైనను కావచ్చును. అది సాంఘికాచారము కాదు. లేక, వ్యక్తిగత ప్రవర్తనయున్నూ కాదు. వేదాంత పరముగా చెప్పవలయునేని, విశ్వనిర్మాణ ప్రక్రియయందది మానవుని ప్రవర్తన. ఇక విశ్వనిర్మాణ ప్రక్రియ జ్ఞానమే! తాత్త్వికతయని చెప్పవచ్చును. దీనిచే మన స్వాభావిక ప్రవర్తనయే! నైతికతయను విషయము స్పష్టమగుచున్నది. కావున యోగము నైతికతయందొక భాగమని తెలియుచున్నది. అందువలన యోగాభ్యాసమునకు పూర్వము స్వాభావికవస్తు సమక్షమునందీ అభ్యాసము ఎట్లుండవలయునో, తెలిసికొనవలసి యున్నది. యోగము సాంఖ్యముపై ఆధారపడి యున్నదను విషయమును మనమెన్నియోసార్లు వినియున్నాము. మరియొక విధముగా చెప్పవలయునేని, నైతికత తాత్త్వికతపై ఆధారపడి యున్నది. అనగా:– క్రియ జ్ఞానముపై ఆధారపడియున్నది. కదలుటెట్లో తెలియకున్నచో, మనమొక అంగుళమైనను కదలజాలము. ఎచ్చటికి వెళ్ళవలయును? ఎందుకు వెళ్ళవలయునను విషయములు కూడా మనకు తెలిసియుండవలయును.

# 7. ఈ ప్రపంచము దేనితో చేయబడినది?

భారతీయ దర్శనములలోని సనాతన భాషయందు "సాంఖ్యము" ఒక ప్రత్యేక శబ్దముగా పరిగణింపబడును. సత్యవస్తుజ్ఞాన సముపార్జనకై పదార్థముల నిర్మాణక్రమము అవశ్యముగా తెలిసియుండవలయును. ఈ ప్రపంచము దేనితో చేయబడినది? విశ్వమనగా:– నీ భావమేమి? మఱియు ఇచ్చట మనయొక్క స్థాయి ఎట్టిది? ఇచ్చటి వాతావరణమునందు మనయొక్క స్థానమెట్టిదో మనకు తెలిసియున్నచో, ఏ సమయములో ఏమి చేయవలయునో మనకు తెలిసియుండును. మనము యోగాభ్యాసము నొనర్పవలయునని మనకు ఎవరున్నూ చెప్పనవసరము లేదు. అది ఆవశ్యకమని మనము స్వయముగా తెలిసికొందుము. ప్రాకృతిక పరిస్థితులే! మనకీ విషయమును తెలియజేయును. మనము ఆహారమును భుజింపవలయునని మనకెవ్వరున్నూ చెప్పనవసరము లేదు. మనము భుజింపవలయునని ఆకలి మనకు చెప్పును. ఒక ప్రత్యేక పరిస్థితి మన మనస్సుకు స్పష్టమైయున్నచో, ఆ పరిస్థితియందు మనమేమి చేయవలయునో మనకు తెలియును. కావున యోగము నొనర్ప వలయునని ప్రజల చెవులలో ధ్వనింపజేయు ఆవశ్యకత ఏ మాత్రము లేదు. ప్రజలు ఏపరిస్థితిలో జీవించుచున్నారో, తదను సారముగా వారి బుద్ధిని వికసింప జేయుటయే! మన కర్తవ్యమై యున్నది.

# 8. విద్య మనుజులకు ప్రప్రథమ ఆవశ్యకతయై యున్నది.

ప్రజలు అజ్ఞానము నందున్నారు. ఇదియే! మనుజుని దీర్ఘరోగము. అజ్ఞానమే! ఒక రకమైన ఆనందముగా పరిణమించినది. ఏలననగా:- అది మనకు తప్పుడు సంతోషము నొసంగుచున్నది. ఈ కారణముచే అంతయు సవ్యముగా నున్నదనియు, ఎచ్చటైనను ఏలాటి దోషము లేదనియును మనము తలపోయుచుందుము. విద్యమనుజులకు ప్రప్రథమ ఆవశ్యకతయై యున్నది. మనకు ధనముగాని, భవనములుగాని, భూములకుగాని కొఱతలేదు. కాని విద్యయే! మిక్కిలి కొఱతగా నున్నది. మనము విద్యావంతులమని మనము తలపవచ్చును. కాని మనవిద్య దైనిక వస్తువులతో సరిపెట్టుకొనునట్టిదై యున్నది. సర్దుకొని పోవుట జీవితము యొక్క బుద్ధికుశలత కాదు. జీవితము యొక్క బుద్ధికుశలత సాంఖ్యమను పేరుతో చెప్పబడుచున్నది. ఇది కపిలమునిచే స్థాపింపబడిన సాంఖ్యమని మనము తలంపవచ్చును. భారతదేశము నందవి కపిలసూత్రములని చెప్పబడుచున్నవి. సాంఖ్యమనగా:- ఇదియే! కాని సాంఖ్యమును ఇట్టి సంకుచిత దృష్టితో చూడరాదు. ఏలననగా:- సాంఖ్యమను పేరుతో మరికొన్ని సాంప్రదాయము లున్నవి. అవి కపిలుని సాంఖ్యముకంటెను మిక్కిలి లోతైన విషయములను సూచించును. సాంఖ్యము మనుస్మృతియందును, మహాభారతమునందును, శ్రీమద్భగవద్గీతయందును మనకు కానబడును. అచ్చట సాంఖ్యము విశాలమైన దృష్టికోణమును కలిగియున్నది. అది కపిలునివంటి సంకుచితత్వమును కలిగిలేదు. అది ఆతని కాలమున కనుగుణ్యముగా యున్నది.

# 9. విశ్వము కేవలము మనకు కానబడునటువంటిది కాదు.

విశ్వము ప్రజలచేతను, జీవులచేతను నిండియున్నది. దానియందు కేవలము మనవంటి జీవులులేరు. దానియందితర పదార్థములు కూడా యున్నవి. మన దృష్టియందవి ప్రాణములేని అచేతన పదార్థములు. మనము మన నేత్రములతో చూచుచున్నదాని కంటె అది ఎంతో విశాలమైనదని మనకు యోగశాస్త్రములు తెలుపుచున్నవి. విశ్వము కేవలము మనకు కానబడునటు వంటిదికాదు. మనము మనచుట్టును, ఆకాశమువైపును చూచినప్పుడు మనకేదో విషయము అవగత మగును. ఇది మన భౌతిక విశ్వము. ఇచ్చట మనము సూర్యచంద్రులు, నక్షత్రములు విశాలమైన ఆకాశము మున్నగు వాటిని తిలకింతుము. వీటన్నింటిని ఒక్కుమ్మడిగా మన ఇంద్రియములు చూచుట సాధ్యముకాదు. మనచుట్టు ప్రజలు, పశు వులు, చెట్లుచేమలు, పర్వతములు ఇత్యాదులున్నవి. భారతీయదృష్టి కోణమీ భౌతికదృష్టి కంటెను లోతునకేగినది. ఈ విశ్వమునందు వివిధములగు భూమికలున్నవని అది మనకు తెలుపును. మన చుట్టునున్న ఈ భౌతికలోకము ప్రత్యేకస్థూలతను కలిగియున్నదని అది మనకు తెలియజేయును. ఐతే అనేక విశ్వములున్నవని మనమనుకొనరాదు. లోకములన్నియును ఒక క్రమమునందొకే విశ్వమునందు పరిభ్రమించుచున్నవి. అవియే (1)భూలోకము (2)భువర్లోకము (3)స్వర్లోకము(4) మహర్లోకము(5) జనలోకము(6) తపోలోకము(7) సత్యలోకము. భూలోకమునందున్న మనకు ఇతరలోకములున్నవను విషయము కూడా తెలియదు.

# 10. మనము నిమ్న భూమికలను దాటియున్నామనుట సాధ్యమే!

భూలోకమునకు దిగువ కూడా కొన్ని లోకములున్నవని మనకు శాస్త్రములు చెప్పుచున్నవి. అవి మన నేత్రములకు కానబడకుండుటచే, అవి ఉన్నవను విషయము కూడా మనకు తెలియదు. అవియే (1) అతల (2) వితల (3) సుతల (4) తలాతల (5) మహాతల (6) రసాతల (7) పాతాళములు మొత్తము పదునాలుగు లోకములున్నవి. ఐతే ఈ పదునాలుగు లోకములకన్నను ఎక్కువ లోకము లుండుటయు సాధ్యమే! ఇవి సుమారుగా గణింపబడిన భూమికలు. ఇవి పూర్వఋషులచే దర్శింపబడినవి. ఇవి వారి క్రమానుగత అనుభవములు. ఒక వ్యక్తియొక్క వికాసమార్గమునందు వీటన్నింటిని దాటవలసియుండును. ఈ లోకములను ప్రతియొక్కరు దాటివలసిన ఆవశ్యకత కలదు. మనము మనకు నిమ్నమునందున్న కొన్ని భూమికలను దాటియున్నామనుట సాధ్యమే! నిమ్నలోకములను దాటి మనమీభౌతిక భూమికను చేరుకొని యున్నాము. ఇవి మనకు యుగానుగత అనుభవములు. మనయొక్క మారుదలచే ఇది సాధ్యమగును. జీవశాస్త్రజ్ఞులు మఱియు భౌతికశాస్త్రజ్ఞులు నేడు జీవిత వికాసమును విశ్వసించినవారై పరార్థమునుండి జీవితము మఱియు మనస్సు, మనస్సునుండి బుద్ధివరకు మనమేతెంచినామని నేడు నుడువుచున్నారు. ఇవి అనుభవపూర్వకమగు భూమికాక్రమమును సూచించును.

# 11. మన మిప్పుడు మానవ భూమిక యందున్నాము.

మన మిప్పుడు మానవభూమిక యందున్నాము. ఐతే మానవతా విశ్వము సంపూర్ణ విశ్వమను కొనరాదు. ఏలననగా:– దీనికి దిగువను, దీనికిపైనను లోకములున్నవి. కావున మానవభూమిక నుండి వికాసమునొందు ఆవశ్యకత మనకున్నది. మనము పురుషోత్తమ స్థితికి వెళ్ళవలసి యున్నది. మన ప్రస్తుత అనుభవమునకు ముందు "పురుషోత్తమ" స్థితి యున్నది. ఇచ్చటనే! మనము తృప్తినొంది యుండుట సాధ్యముకాదు. మనమిచ్చట ప్రతిపదార్థముచే అసంతృప్తులమై యున్నాము. ఏలననగా:– ఇది మన శాశ్వతమైన గృహముకాదు. భూగోళము మనకు శాశ్వతమైన స్థానముకాదు. ఏలననగా:–మనము వికాసక్రమము నందున్నాము. మనము ముందుముందుకు చలించుచున్నాము. మనమెట్లు నిమ్నభూమికల నుండి ఈ మానవ భూమిక కేతెంచియున్నామో, అట్లే మనకు ముందున్న సూక్ష్మమైన, విశాలమున భూమికలగు దేవదూతలు, దేవతలు, స్వర్గవాసులు ఇత్యాది లోకముల కేగవలసి యున్నది. ఈ భూమికలు మనకు శాస్త్రములయందు కానబడును. ఉదాహరణమునకు మనకు తైత్తిరీయోపనిషత్తులో ఈ యనుభవములు సూచింపబడినవి. దానిలో మనుజులకుపైన పితరులున్నారనియు, వారికిపైన గంధర్వులున్నారనియు, వారికిపైన దేవతలున్నారనియు, వారికిపైన దేవతలను పరిపాలించు ఇంద్రుడున్నాడనియు, ఆతనికిపైన బృహస్పతియున్నాడనియు, బృహస్పతికిపైన సృష్టికర్త యున్నాడనియు చెప్పబడినది.

# 12. మనమీ ప్రపంచమునందు సంతుష్టులమై యుండజాలము.

ఉన్నతభూమికలకు సంబంధించిన వివరములు కేవలము భారతదేశమునందే కాక, ఇతర దేశముల యందున్నూ మనకు లభించును. కావున ఇచ్చట మన స్థానమెట్టిదో, మనము ఊహింపవచ్చును. మనమీ ప్రపంచమునందు సంతుష్టులమై యుండజాలము. ఇది నిశ్చయము. ఏలననగా:– ఆకస్మికమైన పూర్ణత్వ ప్రాప్తియొక్క ఫలితమే! ఆనందమని చెప్పబడును. ఎంతకెంతకు మనము పూర్ణత్వమువైపు చలించు చుందుమో, అంతకంతకు మనము సంతుష్టులమగు చుందుము. ఉపనిషత్తు నందుదహరింపబడిన ప్రకారముగా పూర్ణత్వము మనకెంతో దూరమునందున్నట్లు గోచరించుచున్నది. ఈ భౌతికమైన మానవ భూమికకు పైనున్న వివిధములగు భూమికలను మన మధిరోహింప గోరుదుమేని, ఇచ్చట మనమెల్ల కాలము వరకు సంతుష్టులమై యుండజాలము. ఏదియున్నూ మనకు సంతుష్టియొసంగదు. సమస్త ప్రపంచ అస్తిత్వముకూడా మనకు సంతుష్టినొసంగదు. సమస్త భూమండలాధిపత్యము కూడా మనకు సంతుష్టి నొసంగదు. దీనికి కారణములు మనకు తెలిసియున్నవే! ఇచ్చట మనము సంపూర్ణత్వమును బడయజాలకుండుటచే, ఇచ్చట మనకు సంతుష్టి యుండదు. మన వికాసక్రమములోని భూమికలను దాటని కారణముచే, మనమిచ్చట పూర్ణత్వమును బడయజాల కున్నాము. ఇంకను మనము నిమ్న స్థితియందే! యున్నాము.

# 13. యోగాభ్యాసమును మనమేల ప్రారంభింపరాదు?

సాంఖ్యజ్ఞానమునకై పై అంశములు మనకు సహకరించును. సాంఖ్యజ్ఞానము మనలను జాగృతి నొందించును. అది నేడు మనమున్న స్థితినుండి ఉద్ధరింపజేయును. అప్పుడు మన భవిష్యత్తు గూర్చి తెలిసికొనుటకై మనమాతురత కలవార మగుదుము. మన మున్నత శిఖరము నందుకొనుటకై ఇచ్చట మనమేమి చేయవలయునో తెలిసికొనుటకు ఆకాంక్ష కలవారమగుదుము. యోగాభ్యాసమును మనమేల ప్రారంభింపరాదు? ఉన్నత భూమికలనందు కొనుటకై యోగము మనకు సహకరింపదా? అది అంతిమమైన పూర్ణత్వ ప్రాప్తినొందింపదా? అది మనకు పూర్ణతృప్తి నొసంగదా? అది ఇట్టిదైనచో, యోగాభ్యాసము నెవ్వరు మరచియుందురు? మనము యోగము నభ్యసింపవలయునని మరొకరు చెప్పవలయునా? విషయము చక్కగా బోధపడినచో, అంతయు దినమణి వెలుతురువలె స్పష్టముగా నుండును. యోగాభ్యాసము ముఖ్యమైనది కాదు. యోగాభ్యాసము యొక్క ఆవశ్యకతను అనుభవమునకు తెచ్చుకొనుట మిక్కిలి ముఖ్యమైనది దీని తరువాతనే! యోగాభ్యాసము ప్రారంభింపబడును. ఆవశ్యకతయే! లేకున్నచో, అభ్యాసమెక్కడిది? మనము పూర్తిగా అజ్ఞానులమై యున్న కారణము చేతనే! దాని ఆవశ్యకత మనకు తెలియకున్నది. మనము మూర్ఖులుండెడి స్వర్గలోకము నందున్నాము.

# 14. మనము ఊరికే ఉండజాలము.

మిక్కిలి శీఘ్రముగా పరుగెత్తుచున్న ఒక రైలుబండివలె ఈ విశ్వము చలించుచున్నది. అదితన గమ్యస్థానమును చేరుటకై పరుగెత్తుచున్నది. ఈ చలించుచున్న వాహనమునందు మనమంటుబెట్టబడి యున్నాము. మనము ఊరికే ఉండజాలము. మనము దానియందున్న కారణముచే రైలుబండి ఎట్లు చలించుచున్నదో, మనమున్నూ అట్లే చలింపవలసి యుండును. మనము చలించుచున్న విశ్వమునందున్నాము. కావున మనము న్నూ చలింపక తప్పదు. అందువలన మనము సుస్థిరులమై లేము. మనము అఖండముగా స్వతంత్రులమై భిన్నమైన వ్యక్తులుగా కానబడుచున్నాము. మనము ఆత్మ తాదాత్మ్యతతో కూడిన వ్యక్తులము కాము. మనము చలనము గల సమూహము, లేక మూటల వలె యున్నాము. మనము సుస్థిరులమై లేకుండుటయే! దీనికిగల కారణము. మనము వికాసక్రమమునందున్న విశ్వమునందు అవిభాజ్యమైన ఆత్మ తాదాత్మ్యతను కలిగియున్నాము. కావున మహానుభావులైన గౌతమబుద్ధునివంటి వారు పదేపదే చెప్పుచున్నదేమనగా:- ఒక నదియందు మరొక క్షణమునందు అదేజలమును మనము స్పర్శింపజాలము. ప్రవహించుచున్న నదియందు మనము ప్రతిక్షణమునందు క్రొత్త జలమును స్పర్శించుచుందుము. అదే ప్రకారముగా మన స్వంత శరీరమును కొన్ని నిమషముల తర్వాత భిన్నమైన శరీరమును స్పర్శించుచుందుము.

# 15. మనము బంధనమును ఇష్టపడము.

విశ్వము చలించుచున్నది. మఱియు ఈ అనివార్యమైన విశ్వచలనము వికాసమని చెప్పబడును. ఇది వికాసమే! యని Darwin, లేక Lamarck, లేక ఉపనిషత్తులు నుడువుచున్నవి. ఈ వికాసము అంతవంతమైన వస్తువు అనంతమైన దానివైపు చలించుటను సూచించును. అంతవంతమైనది యథా తథముగా నుండుటను అంగీకరింపదు. ఎవరైనను ఏ రకమైన సంకుచితత్వమును ఒప్పుకొనరు. మనము బంధనమును ఇష్టపడము. మనము హృదయ పూర్వకముగా దానిని ద్వేషింతుము. బాహ్యమునందున్న ఏ వస్తువుచేతను నిరోధింపబడుట మన కిష్టముండదు. స్వాతంత్ర్య సమరము నకు కారణమిదియే! ఏలననగా:- మనమన్ని విధములుగా సంకుచితులమై యున్నాము. ఈ శరీరము సంకుచితత్వమును సూచించును. బాహ్యప్రపంచమునందున్న ప్రజల కారణముచే ఇచ్చట నా ఉనికి సంకుచితత్వము నొందుచున్నది. సాంఘిక మఱియు రాజకీయ సంకుచితత్వములు కూడా ఇట్టివే! వాటిచే మనము సంతుష్టులమై లేము. ఏలననగా:- ఒక కారాగారము వలె బంధింపబడుటకు, సంకుచితులమగుటకు, నియంత్రింప బడుటకు ఎవ్వడిష్టపడును? మనము స్వతంత్రములైన పక్షులవలె నుండగోరుదుము. ప్రతిదానియందు మన మధికులమై యుండగోరుదుము. ఇది ఈ విశ్వమునందు సాధ్యముకాని విషయము.

# 16. నిజమైన స్వాతంత్ర్యము.

నిజమైన స్వాతంత్ర్యమును మన ఆత్మ అభిలషించుచున్నది. ఐతే అది ఈ సంకుచితమైయున్న ప్రపంచమునందు లభ్యముకాదు. ఈ ప్రపంచము సంకుచితమైన వ్యక్తులతోను, అంతవంతములగు అనుభవముల తోను నిండియున్నది. మనము మానసికముగను, బౌద్ధికముగను, దురభిమానములను కలిగియున్నాము. అవియన్నియు మనకు సముచితములుగానే కానబడును. కాని అవి వ్యక్తిగతములై, స్వాభిమానపూరితములై యుండును. మనస్సు మఱియు బుద్ధి ఆలోచనాగ్రంథులచే ముడివడియున్న కారణముచే అవి మనకు సముచితములుగా తోచును. మన చిన్నతనము నుండియే! ఇవి మనలనంటుకొని యున్నవని ఇంగ్లండ్ దేశీయుడైన Francis Bacon నుడివెను. మన తల్లిదండ్రులు మనకొక విషయమును చెప్పగా, పాఠశాలలోని ఉపాధ్యాయులు, కళాశాలలోని ప్రొఫెసర్లు మనకు మరొక విషయమును చెప్పిరి. ఇక సంఘము వీటికి భిన్నమైన విషయమును చెప్పును. మనమొక ప్రత్యేకజాతియందు జన్మించియున్నాము. అది తన స్వంత ఆలోచనలను కలిగియుండును. తదనుసారముగా అది తన కార్యమునొనర్చును. ఈ ప్రకారముగా మనము చిన్నతనమునుండియు దిగ్భ్రమయందు మునిగి యుందుము. యోగాభ్యాసము నొనర్చుటకై మనము వీటినుండి వైదొలగవలసి యుండును. తొడుగులుగల మనస్సీకార్యమునకు అనర్హమై యుండును.

# 17.పర్యావరణను సూచించుటకై "విశ్వము" సరియైన శబ్దము.

మనస్సు వస్తుస్వరూపమునకు సరితూగని వివిధములగు చిహ్నములను స్వాభావికముగా కలిగియున్నది. ఈ విశ్వము, ఈ ప్రపంచము, ఈ విశాలమైన పర్యావరణము మనలను చుట్టియున్నది. ఇది పరస్పరము సంబంధములేని విభిన్నములైన కొన్నిముక్కలు, లేక అంశములచే నిర్మింపబడిలేదు. ఈ పర్యావరణను సూచించుటకై "విశ్వము" సరియైన శబ్దము. అది చిందరవందర విషయములకు వ్యతిరిక్తమై యున్నది. చిందరవందర విషయములు తమ ప్రత్యేకతను కలిగియుండును. అవి తమ స్వంతపంథాలను కలిగియుండును. అవి తమ స్వంతదిశలలో చలించుచుండును. అవి పరస్పరము ఒకదానికొకటి ఏలాటి సంబంధములేనివై యుండును. కాని "విశ్వము" వస్తువులనన్నింటిని అందముగా అమర్చును. అది వస్తువులను ఒక క్రమమునందుంచును, దానియందున్న ప్రత్యేకతలు కేవలము భౌతిక సంబంధమును కలిగియుండవు. కాని అవి అంతర్గత సంబంధమును కూడా కలిగియుండును. అంతర్గత సంబంధము మఱియు భౌతిక సంబంధము మధ్యగల తారతమ్యమును తెలుపుటకొక ఉదాహరణ మొసంగబడుచున్నది. దేశములోని పార్లమెంటు సభ్యులు పరస్పరము సంబంధమును కలిగియుందురు. కాని ఈ సంబంధము ఏదో ఒక కారణముచే విచ్ఛిన్నమగుటకు అవకాశమున్నది. ఈ ప్రకారముగా పార్లమెంటు సభ్యులలో నిజమైన అంతర్గత సంబంధముండదు. పార్లమెంటు సభ్యుడు తర హోదాను విరమించు కొనవచ్చును.

# 18. మనము శాశ్వతముగా విశ్వమునకు సంబంధించియున్నాము.

విశ్వముతో మనకుగల సంబంధము ఒక పార్లమెంటులోని సభ్యులమధ్య గల సంబంధమువంటిది కాదు. విశ్వముతో మనకుగల సంబంధము ఆంతరంగికమైనది, అక్షతమైనది, క్రూరమైనది మఱియు శాశ్వతమైనది. దానికి మరణములేదు. మనము శాశ్వతముగా విశ్వమునకు సంబంధించియున్నాము. ఈ సంబంధమునుండి మనము ఏ సమయమునందున్నూ వైదొలగజాలము. మన దేహములోని అవయవములను మన దేహమునుండి విడదీయజాలమని మనము తలంపవచ్చును. కాని దేహముతో అవయవములకు గల ఈ సంబంధము నిమ్నమైనది. ఏలననగా:- దేహములోని ఏ అవయవనైనను ఖండించుటకవకాశమున్నది. మనమొక వ్యక్తియొక్క భుజమును నరికివేయ వచ్చును, లేక, మరేదైన అవయవమును ఛేదింపవచ్చును. అప్పుడా భాగమునకు దేహముతో సంబంధముండదు. కాని ఈ ప్రపంచము, లేక విశ్వముతో మనకుగల సంబంధమును ఏ ప్రకారముగానైనను విడదీయుట కవకాశములేదు. ఇచ్చట అవయవచ్ఛేదము అసాధ్యము. ఈ విశాలమైన విశ్వముతో వ్యక్తులకు, లేక వస్తువులకు గల సంబంధమును విడదీయజాలము. మనము యుగయుగముల నుండి శాశ్వతముగా దీనికి సంబంధించియున్నాము. మఱియు వికాసక్రమమునందు ముందడుగు వేయుచున్నాము. మనము నిమ్నదశ నుండి మానవత్వమనెడి ఈ భూమిక వరకు వికాసమునొంది యున్నాము. కావున మనము మానవదశకు రాక పూర్వము మనము ఉనికిని కలిగియున్నాము.

# 19. మనమీ ప్రపంచముయొక్క పౌరులము ఎంతమాత్రమున్నూ కాము.

వికాసము నిజమైనది. ఇక ఈ వికాసక్రమమునందు నిశ్చయముగా మానవత్వము పరమోన్నతమైనది కాదు. ఒకవేళ మన ప్రస్తుత భూమిక నిమ్నభూమికల యొక్క వికాసఫలితమై యున్నచో, మన ప్రస్తుత భూమికలకేగు సోపానములు కూడా ఉండియుండును. మనము శతాబ్దములు మఱియు యుగములకు పూర్వము ఉనికి కలిగియున్నాము. కావున ఇక ముందున్నూ యుగముల తరబడి మనము ఉనికినికలిగి యుందుము. మనమీ విశాలమైన విశ్వముయొక్క శాశ్వతమైన అంశములము. మనమీ ప్రపంచము యొక్క పౌరులము ఎంతమాత్రమున్నూకాము. మనము ఒరిస్సాకుకాని, మద్రాసుకుకాని చెందినవారము కాము. మనము మనమనస్సులలో ఎంతటి క్షుద్రమైన, అల్పమైన అభిప్రాయములను కలిగియున్నామో చూడుడు! "నేను మహారాష్ట్రీయుడను, నేను పంజాబీని, నేను టమిళదేశీయుడను, నేను కేరళదేశీయుడను" అనిమన మనుచుందుము. మనమెంతటి నీచస్థితికి వచ్చితిమో చూడుడు! మన నిజమైన తాదాత్మ్యతను తెలుపుటకీ క్షుద్ర విషయములను దహరించుట మనకు సిగ్గుచేటు కాదా? నిజమునకు మనము విశాలమైన విశ్వభవనమునకు చెందియున్నాము. అది వివిధములగు భూమికలలో మనవెనుక యున్నది, మనముందున్నది. ఒకవేళ దానిని మనమూహించుటకు ప్రయత్నింతుమేని, మనము గాబరాకు లోనగుదుము. మనము మన చుట్టుముట్టులలో పరికించి, మనమెచ్చట నిలబడి యున్నామో తెలిసికొనగోరుదుము. "నేనీ ప్రపంచమునకు సంబంధించియున్నానా? నేనీ ప్రపంచము నందున్నానా?" మున్నగు ప్రశ్నలచే తలమునకలగుచుందుము.

# 20. ఆధునిక భౌతిక శాస్త్రము చెప్పునదిదియే!

ఈ విశాలమైన విశ్వము మన వెనుక నిమ్నభూమికల యందున్నదనుట నిజము. అది వికాస క్రమము నందు ఉన్నతోన్నతమై యున్నది. యోగాభ్యాసమును గూర్చిన సంశయములు మన మనస్సులలో లేకుండుటకై సూక్ష్మమైన విషయములను తెలిసికొనుట ఆవశ్యకమగును. యోగాభ్యాసభూమిక యందు ప్రవేశించుటకు పూర్వము మనము బౌద్ధిక సందేహము మఱియు చిత్తక్షోభములేని వారమై యుండవలయును. ఈ రెండింటిని భూతములకు వలె త్యజింపవలయును. మన ఆధ్యాత్మిక సాధనయందు భౌతికసందేహములు మరియు చిత్తక్షోభములు మనకు గొప్ప శత్రువుల వంటివి. వీటి నివారణకై మనము శాస్త్రాధ్యయన మొనర్చుటయో, గురువుగారి సలహాను పాటించుటయో చేయ వలయును. ఈ విశాలమైన విశ్వము అఖండమైనదనియు, ప్రకృతికి భిన్నమైనది కాదనియును ప్రతి మతము మనకు తెలుపును. బైబిలైతేనేమి, ఉపనిషత్తులైతేనేమి, ఆధునిక విజ్ఞానశాస్త్రమైతేనేమి అన్నియు ఒకే విషయమును చెప్పును. విశ్వము విడదీయుటకు వీలులేని అవిభాజ్యమగు విషయసమూహమై యున్నది. అది ఒక అణువైయుండెనని విజ్ఞాన శాస్త్రము మనకు తెలుపును. అది రెండు, నాలుగు, ఎనిమిది, పదహారు, ముప్పదిరెండు, అరువదినాలుగు ఇట్లు అనంతముగా విస్తరిల్లి ఊహించుట కలవికానిదిగా మారినది. ఆధునిక భౌతికశాస్త్రము చెప్పునదిదియే! ఆరంభమునందొక శబ్దముండెనని బైబిల్ నుడువును. ఉపనిషత్తులు, వేదములున్నూ ఈ విధముగానే చెప్పుచున్నవి.

# 21. ఆరంభము నందొక కణముండెనని జీవశాస్త్రము పలుకును.

ఆరంభము నందొక కణముండెనని జీవశాస్త్రము పలుకును. ఆరంభమునందు మనము ఏకకణము, లేక సంయుక్త కణములమై యుంటిమి. ఈ ఏకకణము పగిలిరెండుగా విభజింపబడెను. అప్పుడది ద్విదళకణ మయ్యెను. తర్వాత నాలుగుగా విభజింపబడి చతుర్థాంశ కణమయ్యెను. అది ఈ ప్రకారముగా విస్తరిల్లెను. బొంబాయిలో నేనొక భౌతికశాస్త్రజ్ఞుని కలిసియుంటిని ఆతడిట్లనెను. "స్వామీజీ! నేడు వైద్యవిజ్ఞానము వేలకొలది సంవత్సరములకు పూర్వము ఉపనిషత్తులు వెల్లడించిన విషయమునే చెప్పుచున్నది. ఈ విశ్వము అవిభాజ్యమైన ఒకే జీవకణముచే ప్రారంభింపబడినది. ఇప్పుడు మేమున్నూ అట్లే చెప్పుచున్నాము. మనుజుని ఈ పెద్దశరీరమునకు మూలకారణము అత్యంత సూక్ష్మమైన ఒక బిందువైయున్నది". డాక్టరుగారు ఇంకను చెప్పినదేమగా:- ఈ చిన్నని జీవకణమును వైజ్ఞానికముగా పరిశోధింతుమేని, వ్యక్తి ఎంతకాలమువరకు జీవించునో, ఆతడేలాటి అనుభవములకు గుఱియగునో ఇట్టి ఇతర వివరములను వ్యక్తి మరణించువరకు తెలిసికొనవచ్చును. ఈ చిన్నని జీవకణము నందివియును నిర్ణీతమైయున్నవి. ఇక ఉపనిషత్తు చెప్పుచున్నదేమి? ఈ విశ్వములోని వ్యక్తులందఱి మూలము పరమాత్ముని సంకల్పము నందిమిడియున్నది. ఒక ఊరబిచ్చిక కూడా దేవుని సంకల్పములేకుండా క్రిందపడదు. పరమాత్ముని సంకల్పము లేకుండా ఒక ఆకుకూడా చలింపదు. విశ్వాత్మ అనుమతి లేకుండా మనము దేనిని కూడా భుజింపజాలము. ఇట్టి ఏకైక వస్తువు రెండుగా విభజింపబడినట్లు మనకు తోచును.

# 22. నిజముగా అంతవంతమైన వస్తువు అనంతమైన దానిని చింతింపజాలదు.

ఐక్యతాభావము మన మనస్సులలో మొలకెత్తనిదే మనము ఐక్యతను గూర్చి తలంపజాలము. నిజముగా అంతవంతమైన వస్తువు అనంతమైన దానిని చింతింపజాలదు. అంతవంతమైన మేధస్సునందు అనంతభావము చిగురింపదు. ఏలననగా:- ఈ రెండున్నూ భిన్నములై యున్నవి. ఐనను అనంతభావము మన మనస్సులో మొలకెత్తును. మనము అంతవంతములైన వాటి సరిహద్దులను త్రెంచివేయ గోరుదుము. మఱియు అంతములేని వస్తువును దిఙ్మండలమునందు చేరగోరుదుము. కావున దేవుడీ ప్రపంచమును సృష్టించినప్పుడు దేవుడు శూన్యుడైపోడు. పూర్వమున్న దేవుడిప్పటికిన్నీ ఉనికిని కలిగియున్నాడు. భవిషత్తులో కూడా అదే దేవుడు విరాజమానుడై యుండును. దేవుడు శాశ్వతమైనవాడు, ఆతడొక మార్పునొందు పదార్థముకాదు. లేక కార్యరూపమును దాల్చినప్పుడు, శూన్యమై పోవువాడు కాడు. ఇది పరమోన్నతమైన, చక్కని అభిరుచికరమైన తాత్త్వీక అంశము. ఈ విశ్వము ఏకమైయుండెను, ఏకమైయున్నది. ఐనను నానాప్రకారములు గోచరించును. అకస్మాత్తుగా కాదు. మొమ్మొదట అది రెండగును. ఈ రెండగుటను సాంఖ్యము పురుషుడు మఱియు ప్రకృతియగుట యనిచెప్పును. అనగా:- చైతన్యము మఱియు దాని పదార్థము. అంతరాత్మ మఱియు బాహ్యప్రపంచము, ద్రష్ట మఱియు దృశ్యము, కర్త మఱియు కర్మ.

# 23. ద్రష్ట మఱియు దృశ్యములే! పురుషుడు మఱియు ప్రకృతి.

ఒకటి రెండుగా మారును. ద్రష్ట-దృశ్యముల విభజనకు పూర్వము ఏకైక పదార్థముండి యుండెను. అనగా:- చైతన్యముండి యుండెను. ఈ విషయమునందు మన ఊహ అతి విశాలరూపమును ధరించినదై యుండవలయును. ఏననగా:- ఒక వస్తువున్నదను జ్ఞానము కూడా పరబ్రహ్మమును సంకుచితమొనర్చినట్లే యగును. ఆత్మజ్ఞానము కూడా పరబ్రహ్మము యొక్క భూమికయనబడదు. అది “నేనున్నాను” అను అనుభవమును అతిక్రమించినదై యుండును. అది మన భావన కెంతో దూరమునందుండును. తుట్టతుదకది ఉపనిషత్ప్రబోధాను సారముగా “అహమస్మి” “నేనున్నాన”నెడి భూమిక. ఈ విశ్వచైతన్యమునకు  పూర్వము చైతన్యము-దాని పదార్థము. పురుషుడు మఱియు ప్రకృతిలనెడి ద్వివిధ విభజనలు సత్పదార్థములుగా భాసించెను. సాంఖ్యము తాత్వికముగా పురుషుడు మఱియు ప్రకృతి యనెడి ఈ ద్వివిధములగు అంశములను గూర్చి పలుకును. ఈ విశ్వమునందు కేవలము రెండు పదార్థములే! యున్నవి. మరొకటి లేదు. చైతన్యము మఱియు చైతన్యము కానిది. వేఱొక పదార్థము ఉనికిని కలిగియుండుటకు అవకాశములేదు. ద్రష్ట మఱియు దృశ్యములు మాత్రమున్నవి. ఇదియే! సాంఖ్యముయొక్క శ్రేష్ఠత. దీనిని అనుష్ఠించుటయే! యోగము యొక్కలక్ష్యము. మనము పరమోన్నతదశ నుండి నిమ్నస్థాయికి ఎట్లు దిగినామో తెలిసికొనుటయే! యోగాభ్యాస మనబడును.

# 24. వ్యక్తియందున్న ద్రష్టను గుర్తించుటయే! అధ్యాత్మమనబడును.

ఈ విశ్వములోని మన అనుభవమంతయు పురుషుడు-ప్రకృతి, చైతన్యము-పదార్థము మఱియు ద్రష్ట-దృశ్యములపై ఆధారపడియున్నది. మన అనుభవము ద్రష్ట-దృశ్యములచే నిర్మింపబడినదని యోగశాస్త్రములు నుడువును. ఇది సంస్కృతములో "వ్యావహారికసత్తా" యనబడును. ఇది అనుష్ఠానాంశము. ఏలననగా:- ఇది మనకుగోచరించుచున్న సత్యము. ఐనను, ఇది పూర్ణసత్యము కాదు. ద్రష్ట-దృశ్య అంశములు, చైతన్యము -పదార్థ అంశములు, పురుష-ప్రకృతి అంశములు పురాతన శాస్త్రములలో అధ్యాత్మ మఱియు అధిభూతములుగా వర్ణింపబడినవి. వ్యక్తియందున్న ద్రష్టను గుర్తించుటయే! "అధ్యాత్మ"మనబడును. విశ్వమునందున్న పదార్థములు "అధిభూత"యనబడును. ఇది మన ఎదుట కానబడును. కపిలుని సాంఖ్యము పురుష-ప్రకృతులనెడి ఈ ద్వివిధములగు అంశములకు సంకుచిత మొనర్పబడినది. మరియొక దాని ఆవశ్యకత దానికి గోచరింపదు. కాని యోగశాస్త్రములు కపిలుని సాంఖ్యముపై పూర్తిగా ఆధారపడి యుండవు. ఈ శాస్త్రములలో మార్పు మఱియు వికాసమున్నది. మనుస్మృతి, మహాభారతము, భగవద్గీత మఱియు ఉపనిషత్తులు సాంఖ్యము నతిక్రమించిన అంశములను కలిగియున్నవి. ఉపనిషత్తులు మఱియు భగవద్గీత మూడవ అంశమైన "అధిదైవము"ను పేర్కొని యున్నవి. ఈ "అధిదైవము" ద్రష్ట మఱియు దృశ్యములకు మధ్య, పురుష-ప్రకృతులకు మధ్య సంబంధమును కలుగజేయును.

# 25. ద్రష్ట- దృశ్యములకు మధ్య సంబంధము అనివార్యము.

ద్రష్ట–దృశ్యములకు మధ్య సంబంధము కేవలము ద్రష్ట–దృశ్యములచే సంభవింపదు. కర్త తన పదార్థమునకు సంబంధించియుండును. ద్రష్ట– దృశ్యములకు మధ్య సంబంధము అనివార్యము. రెండు విభిన్నములైన అంశములు ఒకదాని కొకటి పరస్పరము సంబంధించియుండవు. మఱియు అవి ఒక దానినొకటి పరస్పరము తెలిసికొనజాలవు. కర్త–కర్మలకు మధ్య సంబంధము చైతన్యమనెడి పదార్థముచే సంభవించును. కాని ఇది సంకుచితములై యున్న నేత్రములకు కానబడకుండును. మఱొక పదార్థము లేకుండా ప్రపంచముయొక్క అస్తిత్వమును మనము తెలిసికొనజాలము. అది ఏమాత్రము సంభవింపదు. మనకు బాహ్యమునందేదో యొక పదార్థమున్నట్లు మనకెట్లు తెలియును? ఆ పదార్థము ద్రష్టకు పూర్తిగా విభిన్నమైన యున్నది, పదార్థములు ద్రష్టకు పూర్తిగా భిన్నముగా లేనికారణముచే, ద్రష్ట–దృశ్యములకు మధ్యగల సంబంధము నిరూపింప బడుచున్నది. ఆ సంబంధము ద్రష్ట–దృశ్యములకు అతీతమైయున్నది. కావున అధ్యాత్మ– అధిభూతములకు అతీతమై అధిదైవమనునదున్నది. ఒకే అనంతమైన పదార్థము, లేక అధిదైవము రెండుగా మారును. అనగా:– పురుష–ప్రకృతులుగా మారును. లేక అధ్యాత్మ–అధిభూతములుగా మారును. లేక కర్త–కర్మలుగా మారును. కాని అది ఏకముగానే శేషించియుండును. పాలు పెరుగుగా మారునట్లు దేవుడు ప్రపంచముగా మారడు. ఏలననగా:– పాలుపెరుగుగా మారిన తర్వాత అది మరల పాలుగా మారదు.

# 26. మూడవ పదార్థము లేనిదే రెండు పదార్థములకు సంబంధముండదు.

పరమపురుషుని ఆంతరంగిక మార్పుచే ప్రపంచమేర్పడదు. అది నిజమేయైనచో, ప్రపంచము దేవునిగా మారకుండెడిది. పెరుగు మరల పాలుగామారదు కదా! ఇట్టిమార్పు దేవునియందు సంభవింపదు. పరమపురుషుడు అఖండుడు. కావున ఆతనియందు మార్పు అసాధ్యము. ఈ ప్రకారముగా తాత్కాలికముగా ద్రష్ట–దృశ్యములుగా మారినట్లు కానబడినను, పరమపురుషుడు తన ఏకత్వమును పోషించుకొనును. అది కర్త–కర్మలుగా తాత్కాలికముగా మారును. ఇట్లు ద్వంద్వమునకు అస్తిత్వమున్నట్లు తోచినను, ఏకత్వసిద్ధాంతము శేషించియుండును. అందువలన ద్వంద్వభూమిక కతీతముగా తృతీయ సృష్టియున్నదని తెలియుచున్నది. ఒక వైపు అధిభూతముగా విశ్వమున్నది. మరొకవైపు ద్రష్టయగు అధ్యాత్మమున్నది. ఇక ఈ రెండింటికి పైన ఈ రెండింటికి సంబంధము నేర్పఱచునట్టి అతీతమైన వస్తువున్నది. అది దేవత, దివ్యత్వము, లేక దేవుడని చెప్పబడును. అది విశ్వాత్మయనియును చెప్పబడును. మానసిక విషయ ప్రపంచమున కతీతమైన పదార్థమున్నదని Plato పలికెను. మూడవ పదార్థములేనిదే రెండు పదార్థములకు సంబంధముండదు. ఈ మూడవ పదార్థమే! దేవత, లేక దివ్యత్వము. సామాన్యముగా ప్రజలు భారతదేశమునందు అనేక మతములున్నవనియు, అనేక దేవతలున్నారనియును తలంచుచుందురు. ఇది భారతదేశ దార్శనిక పునాదికి పూర్తిగా దురూహ్య విషయమైయున్నది. అనేక దేవతలకు అస్తిత్వములేదు.

# 27. శ్రవణమునకు శబ్దము విషయమై యున్నది.

శ్రవణమునకు శబ్దము విషయమై యున్నది. విషయము లేనిదే శ్రవణము చేయుట అసాధ్యము. మనము ఐదుజ్ఞానేంద్రియములను కలిగియున్నాము. కావున విషయములున్నూ ఐదు కలవు. ఒకవేళ మనము ఒక వెయ్యి ఇంద్రియములను కలిగియుందుమేని. ఒక వెయ్యి విషయములను మనము కలిగియుండెడివారము. స్పర్శజ్ఞానము కలుగుటకు మనకు "స్పర్శతన్మాత్ర" యున్నది. "స్పర్శ" తన్మాత్ర చేతనే! మనకు స్పర్శజ్ఞానము కలుగుచున్నది. "రూప" తన్మాత్రచే మనకు దృశ్యజ్ఞానము కలుగుచున్నది. అదే విధముగా "రస" తన్మాత్రచే మనకు రుచి ఏర్పడుచున్నది. ఇక "గంధ" తన్మాత్రచే మనము వాసన చూడగలుగుచున్నాము. ఈ ప్రకారముగా "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ" తన్మాత్రలచే మన పంచేంద్రియములు పనిచేయుచున్నవి. "ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథ్వి" తత్త్వములు "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ" ముల యొక్క స్థూలరూపములు. ప్రపంచమునందు మనము కేవలము ఈ పదార్థములను మాత్రమే! కలిగియున్నాము. మనము మన నేత్రములను తెఱచి మనచుట్టు పరికింతుమేని, ఇవి తప్ప మరియొకటి మనకు కానబడదు. ఈ పంచభూతముల యొక్క వివిధములగు అంశములచే మనకీ ప్రపంచమునందు వివిధములగు వ్యక్తిత్వములు కానబడుచున్నవి. ఇవి యన్నియును "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధము" లయొక్క మార్పునొందిన రూపములే! ఈ ప్రకారముగా మనము భౌతికమైన నిమ్నభూమికయగు పృథ్వికేతెంచితిమి. ఈ పృథ్విభూమికకు అనుగుణములైన అంశములను పాశ్చాత్యులు అంగీకరింపరు. వారు నిమ్నములైన చెట్లుచేమల నుండి వికాసమునొందుచు, క్రమముగా మానవ స్థాయిని చేరుకొందురు.

# 28. మనము సామాన్యముగా తలంచున దిదియే!

పాశ్చాత్య ఆలోచనకు సంబంధించిన విద్య మనము నిమ్నస్థితినుండి ఉన్నతభూమికకు చేరుకొనుచున్నామని తలంచునట్లు చేయును. మనకు అధిరోహణ క్రమమునందు పురోభివృద్ధి కలుగుచున్నదనియు, మనము జడపదార్థము నుండి జీవితమునకు, ప్రాణమునుండి మనస్సునకు, మనస్సునుండి బుద్ధివరకేతెంచి నామనియును అదిమనకు చెప్పును. మానవుడు సృష్టియొక్క శిఖరాగ్రమునందుకొన్నాడని అదినుడువును. మనము అన్నివిధములుగా పశువులకంటె శ్రేష్ఠులము. పశువులు చెట్లుచేమలకంటె శ్రేష్ఠమైనవి. ఇక చెట్లుచేమలు జడపదార్థముకంటె శ్రేష్ఠమైనవి. మనము సామాన్యముగా తలంచునదిదియే! ఈ ప్రకారముగా తలంచునట్లు మనముచేయబడితిమి. ఏలననగా:– ఈ విషయము మనవిద్యా విధానమునందు మనకు మరల మరల చెప్పబడినది. కాని ఇది పూర్తిగా నిజముకాదు. మనము సత్యమువైపు చలించుచున్నామని దీని భావముకాదు. ఇది నిజముగా అభివృద్ధికి విషయము కాదని మనకు ఐతరేయోపనిషత్తుచే తెలియబడును. దీనియందున్న సూక్ష్మభావము ఇతర విద్యావిధానములచే తెలియబడదు. దీనినొక ఉదాహణచే నిరూపించవచ్చును. రెండవసంఖ్య ఒకటికంటె ఎక్కువైనది. మూడు రెండింటికంటె ఎక్కువైనది. నాలుగు మూడింటి కంటె ఎక్కువైనది. ఐదు నాలుగు కంటె ఎక్కువైనది. కాని మైనస్ రెండు, ప్లస్ ఒకటికంటె ఎక్కువైనది కాదు.

# 29. మనమిప్పుడు మన గృహమునకు దూరముగా నున్నాము.

మన మిప్పుడు మన గృహమునకు దూరముగా నున్నాము. ఒక కుంటుంబములోని ఒక వ్యక్తి ఇంటికి దూరముగా నున్నంత మాత్రముచే, ఆతని మనుష్యత్వమునకు కొఱత యుండదు. ఆతడు కుంటుంబములో లేకున్నను, ఆతడు యథాతథముగానే యుండును. కాని మొదట మనకున్న విశిష్టతను కోల్పోయితిమి. అట్లుకాదేని, మనమీ చిన్న దేహమునందున్నను, దేవుని వలె చింతించుచుండెడివారము. అది ఇప్పుడు మనకు సాధ్యముకాదు. ఈ విషయము మిక్కిలి సుందరముగా ఐతరేయోపనిషత్తు నందు వర్ణింపబడినది. పరమపురుషుని నుండి విడివడిన తత్క్షణమే! వ్యక్తికి ఆకలి, దాహము ఉత్పన్నమైనవని ఉపనిషత్తు పలుకును. మన దైనిక జీవితమునందీ ఆకలి మఱియు దాహము స్థూలరూపముందున్నది. మానవ భాషలో వర్ణించుటకు సాధ్యముకాని తపన, ఆతురతలు ఏర్పడెను. పరమపురుషునితో మనకున్న సంబంధము విచ్ఛేదమొనర్పబడుట ప్రపంచములోని మన ఆస్తినంతటిని పోగొట్టుకొనుట కంటె మిన్నయైనది ఏలననగా:- దానిచే మనహృదయము తల్లడిల్లును. మనమప్పుడు ఉపద్రవములచే నిండియున్న వ్యక్తులమై యుందుము. దేవుడు మనలను రెండు విధములుగా శిక్షించెను. ఈడెన్ వనములో ప్రవేశింపకుండుటకై ఆడం మఱియు ఇవ్ లపై ఒక మండుచున్నఖడ్గము పెట్టుబడినదని బైబిల్ చెప్పుచున్నది. అప్పుడు మనము దేవుని చింతింప జాలకుందుము. అంతేకాదు, ఏది సత్యముకాదో, దానినిగూర్చి చింతించుచుందుము. పూర్ణత్వమును పూర్తిగా మరచి పోవుట "ఆవరణ" యని చెప్పబడును.

# ౩౦. ద్రష్ట చూడ బడదు.

ద్రష్ట చూడబడదు. నాలోనున్న ద్రష్ట కేవలము ఊహింప బడుచున్నది. భౌతిక ప్రపంచము మనకు బాహ్యముగా కానబడుచున్నది. కావున మనము పోగొట్టుకొన్న మనస్వంత చైతన్యమును తిరిగిపొందు ఆవశ్యకత ఏర్పడినది. ఏలననగా:- సత్యమెల్లప్పుడు జయించును. సత్యము నిశ్చయాత్మకమైనది. ప్రపంచము మనకు బాహ్యముగా లేదను విషయమే! సత్యము. మన మీ విశ్వమునకు బాహ్యమునందుండుట, లేక విశ్వము మనకు బాహ్యమునందుండుట అసత్యమైన అంశము. కావున మనమీ పొరపాటును సరిపుచ్చుకొనుటకై అన్నింటితో సంబంధము కలవారమై అన్నింటిని లాగుకొని, మన స్వంతము చేసికొనుటకై ప్రయత్నించు చుందుము. ఆస్తిని స్వంతము చేసికొనుట మఱియు సర్వాధికృత నొందుట నిజమునకు సర్వేశ్వరునితో ఐక్యమునొందు వాంఛను తీర్చుకొనుటయే! యగును. పొందుట అనగా:- ఐక్యమగుట. కాని ప్రతిబింబము మూలమైన వస్తువుతో తాదాత్మ్యము నొందజాలదు. ఏలననగా:- ఈ రెండున్నూ విశిష్టతయందు విభిన్నములై యున్నవి. ఈ కారణముచే మనము వస్తువులతో సంబంధమును కలిగియున్నప్పుడు, నిజమైన సంబంధమును కలిగిలేము. కావున ప్రతి కోరికయున్నూ చిట్టచివరికి నిరాశను కలిగించును. వస్తువులను హస్తగతమొనర్చుకొనుటకై మనము చేయు ప్రయత్నములన్నియును విఫలములై మనకు దుఃఖమే! మిగులును. దేశ-కాలములకు సంబంధించిన తృప్తి అశాశ్వతమైనది. అది శాశ్వతమగుట అసాధ్యము.

## సంకీర్తన

# నమస్తే శరణ్యే

శ్లో॥ సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే ।
భయేభ్యస్త్రాహినోదేవి, దుర్గేదేవి నమోఽస్తుతే ॥

1. నమస్తే శరణ్యే శివే సానుకంపే,
నమస్తే జగద్వ్యాపికే విశ్వరూపే ।
నమస్తే జగద్వంద్య పాదారవిందే,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

2. నమస్తే జగచ్చింత్యమాన స్వరూపే,
నమస్తే మహాయోగిని జ్ఞానరూపే ।
నమస్తే నమస్తే సదానందరూపే,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

3. అనాథస్య దీనస్య తృష్ణాతురస్య,
భయార్తస్య భీతస్య బద్ధస్య జంతోః ।
త్వమేకా గతిర్దేవి నిస్తార కర్త్రీ,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

4. అరణ్యే రణే దారుణే శత్రుమధ్యేఽ
నలే సాగరే ప్రాంతరే రాజగేహే ।
త్వమేకా గతిర్దేవి నిస్తార నౌకా,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

5. అపారే మహాదుస్తరేఽత్యంత ఘోరే,
విపత్సాగరే మజ్జతాం దేహభాజాం ।

త్వమేకా గతిర్దేవి నిస్తార హేతు -
ర్నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

6. నమశ్చండికే చండదోర్దండ లీలా,
సముత్ఖండితాఖండ లాశేషశత్రో ।
త్వమేకా గతిర్దేవి నిస్తారబీజే,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

7. త్వమేవాఘభావాధృతా సత్యవాదీ,
నజాతా జిత క్రోధనాత్ క్రోధనిష్ఠా ।
ఇడా పింగళాత్వం సుషుమ్నాచ నాడీ,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

8. నమోదేవి దుర్గే శివే భీమనాదే
సరస్వత్యరుంధ త్యమోఘ స్వరూపే ।
విభూతిః శచీ కాళరాత్రిః సతీత్వం,
నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే ॥

9. శరణమపి సురాణాం సిద్ధవిద్యాధరాణాం,
మునిమనుజ పశూనాం దస్యుభిస్త్రాసితానాం ।
నృపతిగృహ గతానాం వ్యాధిభిః పీడితానాం,
త్వమసి శరణమేకాదేవి దుర్గే ప్రసీద ॥

10. సర్వంవా శ్లోకమేకంవా, యః పఠేద్భక్తిమాన్సదా ।
ససర్వం దుష్కృతం త్యక్త్వా ప్రాప్నోతి పరమం పదం ॥

# మృత్యుంజయ మహా మంత్రము



"ఓం త్ర్యంబకం యజామహే
సుగన్ధిం పుష్టి వర్ధనమ్ ।
ఉర్వారుకమివబంధనాత్
మృత్యోర్ముక్షీయమాఽ మృతాత్ ॥"

**అర్థము :-** ఓం = ఓ భగవంతుడా!, త్ర్యంబకం = మూడు కన్నులు కలవానిని, యజామహే = పూజించుచున్నాము, సుగంధిం = దివ్యపరిమళముగల దేహము కలవానిని, పుష్టి వర్ధనం = ఆరోగ్యమును, బలమును అభివృద్ధి చేయువానిని, ఉర్వారుకం = దోసకాయను, బంధనాత్ = తొడిమ నుండి (త్రుంచిన), ఇవ = విధముగా (అంత సులువుగా), మృత్యోః = మృత్యురూపమైన సంసారము నుండి, ముక్షీయ = విముక్తి కలిగించుము, మా = వద్దు, అమృతాత్ = అమృతము నుండి.


**తాత్పర్యము :-**

"దోసకాయను తొడిమ నుండి సులువుగా త్రుంచి వేసినటుల, మృత్యుబంధము నుండి మమ్ముద్ధరించి, అమరత్వము నొసంగుటకు సర్వజీవులకు పోషణ కర్తయు, దివ్యపరిమళముగల దేహము గలవాడునగు ముక్కంటిని ఆరాధించుచున్నాము".

ఈ మహామృత్యుంజయ మంత్రము మిక్కిలి శక్తిదాయకమైన మంత్రము. దీనిని నిత్యము 108 సార్లు పఠించు వారలకు అపమృత్యు భయముండదు. అట్టి వారు ఆయురారోగ్యములతో జీవించి, అమృతత్వమును బడయుదురు.

# మాఘమాస ప్రబోధము

# MAAGHA MAASA PRABODHAMU



ఈ పుస్తకము పూజ్యపాద

**శ్రీ కృష్ణానంద స్వాములవారి**

జన్మశతాబ్ది (25.4.2022)

శుభసందర్భమునందు శ్రీవారి చరణ

కమలములయందొక పూజాపుష్పముగా

సమర్పింపబడినది.

Read & Realise

Madhava Divya Dham


## మాధవ దివ్యధామ్

బెంగుళూరు

2022